# సంక్షోభం

"నగరంలో సంచలనం..."

ఆరోజు హెడ్‌లైన్స్‌కి స్థానిక పత్రిక 'సమాచారం' ఆఫీసులో కలకలం. జగన్నాథం మనసులో కలవరం.

"ఒక్కరోజు నేను ఊళ్ళో లేకపోతే లేనిపోని సమస్యలు తెచ్చి పెడతావోయ్ గోపీ నువ్వు..." అంటూ ఒంట్లో పుట్టిన గాబరాతో విసుగ్గా అన్నాడు జగన్నాథం.

"సమస్యలేవీ లేవండీ... చూడండి రేపీపాటికి మన పత్రికకి లక్ష్మీకటాక్షం." ఉత్సాహంగా అన్నాడు గోపీ.

"ఆ భానోజీరావు మనమీద లీగల్‌గా ప్రొసీడవకుంటే ఉంది దారి... లేకపోతే చూడూ... ఇంతవరకూ కోర్టు కేసుల ప్రకటనలతో సగం పేజీలు నింపుతున్నాం. ఇకమీద భానోజీరావు మన పత్రిక మీద వేసిన దావాల్ని గూర్చి అతనే ఇచ్చిన ప్రకటనలు వేయవలసి వస్తుంది." అన్నాడు జగన్నాథం ముఖంమీద విచార రేఖలు వ్యాపిస్తుండగా.

"డోంట్ వర్రీ సర్... అంతవరకు రానిస్తానా? మీ శిష్యుణ్ణి, మీజర్నలిస్టుని నన్నామాత్రం నమ్మలేకపోతే ఎలా? నేనీరోజు భానోజీరావుగారిని కలుస్తున్నాను" అన్నాడు గోపీ.

"ఎందుకు నాయనా? మళ్ళీ ఏం సమస్య తెచ్చి పెడతావ్?" అన్నాడు జగన్నాథం గాబరాగా.

"సాయంత్రానికి మీరే చూస్తారుగా" అంటూ హుషారుగా వెళ్ళిపోయేడు గోపీ.

అప్పుడే టేబిల్‌మీద కొచ్చిన పత్రికను చేతిలోకి తీసుకుని చూసేడు

జగన్నాథం.

హాఫ్ డెమ్మీ సైజులో స్థానిక పత్రిక....

సమాచారం...

జగన్నాథం దాని యజమాని, ఎడిటర్.

సమాచారం టైటిల్ స్ట్రిప్‌పోగా ఎడమ దిగువనొకటి, కుడి దిగువ నొకటి కోర్టు కేసుల ప్రకటనలు... ఈ మూడింటి మధ్యగా ఇంగ్లీషు అక్షరం 'టి' ఆకారంలో డార్క్‌చేసి సమాచారం సర్వే వేసిన బాక్స్ ఐటమ్ అది.

"నగరంలో సంచలనం...

వస్త్రవ్యాపారంలో క్రిందటి సంవత్సరం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన లాటరీ స్కీములు విజయవంతం కావడంతో ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రఖ్యాత వస్త్ర వ్యాపారి శ్రీ భానోజీరావు తమ కొత్త షోరూమ్ 'అమరదీప్' ద్వారా కొత్త కొత్త బహుమతి పథకాలు ప్రవేశపెట్టారు. రెండువందల రూపాయలకు పైగా కొనుగోలు చేసిన వారికి ఒక బహుమతి కూపన్ ఇస్తారు. ప్రతిరోజూ రాత్రి పది గంటలకు ఆరోజు కోసిన బహుమతి కూపన్‌లను డ్రా తీసి మొదటి బహుమతిగా స్కూటర్, రెండవ బహుమతిగా బంగారు గొలుసు, మూడు, నాలుగు బహుమతులుగా చీరలు, ఫేంటు పీసులు ఇవ్వనున్నారు. అంతేగాక సంక్రాంతి పండుగకు బంపర్ డ్రా తీసి ఏసీ డీలక్సు కారు మొదలుగాగల బహుమతులివ్వనున్నారు. నగర వస్త్ర చరిత్రలో ఈ పథకాలు నూతన చైతన్యాన్ని కలిగించనున్నాయని పరిశీలకుల అంచనా."

చదివి తృప్తిపడ్డాడు జగన్నాథం.

అంతవరకూ బాగానే ఉంది. కాని తరువాత రాసినది...?

అనుమానంగా చదవడమా మానడమా అని ఆలోచిస్తూ చివరికి భయంతో ఆలోచన సాగక పేపరవతల పడేసాడు జగన్నాథం.

ఆ సాయంత్రం "సక్సెస్.." అంటూ వచ్చాడు గోపీ.

"ఏవిటి?" అనడిగేడు నిర్లిప్తంగా జగన్నాథం.

"ఈ నెల్లాళ్ళూ లాస్ట్ పేజీ కాంట్రాక్టు.... అమరదీప్ బహుమతి పథకాల ప్రకటనలు... భానోజీరావుగారిచ్చేరు..." ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు గోపీ....

"పత్రిక నిలబడ్డానికి భానోజీరావుగారి ప్రకటనలు తోడ్పడతాయి. నిజమే.... కాని గోపీ... అందులో కూడా ఆయన వ్యాపార సరళీ, రాజకీయ చాతుర్యం చూపించుకున్నారు..." అన్నాడు జగన్నాథం.

"మన పత్రిక ఆయన వ్యాపార రహస్యాలు బయట పెట్టకుండా ఉండడానికి ప్రకటనల కాంట్రాక్టులతో నోరు మూయిస్తున్నారంటారు. అంతేనా?..."

"కాదా?"

"ఇన్నాళ్ళుగా మీ దగ్గరే పనిచేస్తున్నాను. మీ సిద్ధాంతాలు జీర్ణించుకున్నవాడిని. ఆ సంగతి నేను తెలుసుకున్నాన్సార్... అయితే ఇది రెండు విధాలుగా మనకు మంచిదని సంతోషిస్తున్నాను..." అన్నాడు గోపీ.

"గుడ్... దేనికో చెప్పు నేనూ మెచ్చుకుంటాను..." అన్నాడు జగన్నాథం గోపీవంక సంతృప్తిగా చూస్తూ.

"మొదటిది... మన పత్రిక ఈ ప్రకటనల ద్వారా వచ్చిన డబ్బుతో కొంతకాలం నిలదొక్కుకోగలదు. రెండోది... భానోజీరావుగారి రాజకీయ చాతుర్యం ఫలించిందని ఆయన అనుకోవడానికి మన పత్రికలో ఆయనకు వ్యతిరేకంగా ఏమీ రాయకుండా ఉన్నందువల్ల ఆయన క్లోజ్ సర్కిల్స్‌లోకి వెళ్ళగలం"

"వెళ్తే ఏమిటీ ఉపయోగం...? మన పత్రిక పెట్టుబడిదారీ వర్గానికి తొత్తులుగా తయారవుతుంది. అంతకంటే ఈ పత్రిక మూసెయ్యడం మంచిది కాదంటావా గోపీ?"

"మీ ఆవేశం నాకు మరింత ఉత్తేజాన్నిస్తోంది సార్... ఆ ఆవేశంతోపాటు

ఆలోచనని కూడా జోడించి నిదానంగా మన లక్ష్యం సాధిస్తాను సార్... మన పత్రిక ప్రతిష్టను పెంచుతాను సార్..." అన్నాడు దృఢంగా గోపీ.

"బెస్టాఫ్ లక్" అన్నాడు జగన్నాథం గోపీ భుజం తడుతూ.

"నాణ్యమైన బట్టల కోసమే కాకుండా విలువైన బహుమతి కూపన్లకోసం కూడా ఎగబడుతూన్న కొనుగోలుదార్లు. ఈ రోజు అమర్‌దీప్‌లో కొనుగోలుదార్ల సంఖ్య పదిహేడు వందల ఏభై. రాత్రి తీసిన డ్రాలో బహుమతులు పొందిన అదృష్టవంతుల పేర్లు..."

"మీ ఇంట్లో పండుగ సంరంభంతో ఆనందోత్సాహాలు, అమర్‌దీప్‌లో బహుమతుల సంచలనంతో ఉద్యోగావకాశాలు, చురుకుదనం, స్ఫురద్రూపం ఉన్న యువతీయువకులు సేల్స్‌గర్ల్స్, సేల్స్‌మెన్‌లాగా నియమించబడడానికి రేపు ఉదయం పది గంటలకు అమరదీప్‌కు హాజరు కాగోరుతున్నారు..."

"పెరుగుతూన్న కొనుగోలుదార్ల సంఖ్య, పెచ్చుపెరుగుతూన్న బహుమతులు. ఈరోజు కొనుగోలుదార్ల సంఖ్య రెండు వేల ఏడువందలు. ఉత్సాహవంతులైన కొనుగోలుదార్లకు ప్రోత్సాహకంగా అన్ని బహుమతుల కూపన్ల వెనక ముందు నంబర్లకు రిస్ట్ వాచీలు ఇవ్వనున్నారు..."

"మురుగుతున్న పెట్టుబడి, చెల్లుపోని బట్టలు, నిట్టూర్పుల వడగాలిలో విలవిలలాడుతూన్న చిన్న, మధ్య తరగతి వస్త్ర వ్యాపారులు - అమరదీప్ అందిస్తున్న బహుమతుల పథకాలతో పోటీ పడలేక, ఇంకో విధంగా అమ్మకాలు పెంచలేక విలవిలలాడుతున్నారు..."

"మకర సంక్రాంతికి మధుర స్మృతులు, కొత్త అల్లుళ్ళకు కొత్త డిజైన్లలో దుస్తులు బహూకరించి కుమార్తెల ముఖాలలోని సంతోష వీచికలలో సేదదీరరండి. సంక్రాంతి పండుగకు సాంప్రదాయిక బహుమానం. పితృదేవతలకు అపూర్వమైన బట్టలు బహూకరించడానికి అమరదీప్‌కు విచ్చేయండి. అమరులైన మీ పితృదేవతల్ని ఆనందపరచండి....."

భానోజీరావిస్తున్న ప్రకటనలతోనూ, ప్రకటనల ద్వారా వస్తున్న రాబడితోనూ ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు జగన్నాథం.

"గోపీ, నువ్వు తీసుకుంటున్న చొరవతో సమాచారం నాలుగు కాలాల పాటు నిలుస్తుందోయ్" అన్నాడు.

"అబ్బే...మన దేవుందండీ? భానోజీరావు గారు అన్ని పత్రికలకూ ఇచ్చినట్టుగానే మనకూ ఇస్తున్నారు. మనమీద ప్రత్యేకమైన అభిమానమేమీ లేదు. పోతే మొదటగా మనం వేసిన బాక్స్ ఐటమ్‌తో మనల్ని గ్రిప్‌లోనికి లాగడానికి కాస్త దువ్వుతున్నారంతే. మిగిలిన పత్రికలకి ఈ ప్రకటనల మీద పెద్దగా ఆసక్తిలేదు. మనకిదే బ్రహ్మాండం. మరంచేత శ్రద్ధ తీసుకుని ఆకర్షణీయంగా ప్రెజెంట్ చేస్తున్నాం...." అన్నాడు గోపీ.

"కానీ గోపీ... భానోజీ రావుగారి అభినందన సభ సంగతేవిటోయ్? అందులో ఉపన్యాసకుడిగా నీ పేరు వేయించడానికి అనుమతి కోరుతూ కబురు... ఏవిటి జరుగుతుందో..." ఆందోళన ప్రతిఫలించింది జగన్నాథం మాటల్లో.

"అది మంచి అవకాశం గురూగారూ! గోపీగా కాక పత్రికల ప్రతినిధిగా పత్రికల లక్ష్యం నెరవేర్చాలనుకుంటున్నాను" అన్నాడు గోపీ దృఢంగా.

గోపీ మాటలకు సంతృప్తి పడుతున్నా, భానోజీరావుద్వారా వస్తున్న రాబడికి ఇరకాటంగా ఉండడంతో సిద్ధాంతపరమైన సంఘర్షణ చెలరేగుతూనే ఉంది జగన్నాథం మనసులో.

సంక్రాంతి సాగిపోయింది.

భానోజీరావు గారి అభినందన సభ.

గోపీ ఉపన్యాసం ప్రారంభించాడు.

"నగరంలో సంచలనం సృష్టించిన శ్రీ భానోజీరావుగారి అభినందన సభకు విచ్చేసిన నగర పౌరులకు ముందుగా నా అభినందనలు

తెలుపుకుంటున్నాను.

"నగరంలోనే కాదు, వస్త్ర ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని కదలికలు తీసుకు వచ్చినవారు శ్రీ భానోజీరావుగారు. వారి జీవిత విశేషాలనూ, గొప్పదనాన్నీ తోటి ఉపన్యాసకులద్వారా విన్నారు. యింకా వింటారు. కాబట్టి సమాచారం పత్రిక తరఫున భానోజీరావు గారి వ్యాపార సరళిని విశ్లేషించి మీ ముందుంచాలని నేను అభిలషిస్తున్నాను...

"ప్రతి రెండు వందల రూపాయల కొనుగోలుకూ ఒక బహుమతి కూపను ఇచ్చి ప్రతి రోజూ ఒకస్కూటరు, బంగారు గొలుసు, చీరలు, ఫేంటు పీసులు కాక రిస్టువాచీలనుకూడా ఎంతో ఉదారంగా బహూకరిస్తూ అమరదీప్ బహుమతి పథకాన్ని దిగ్విజయంగా నిర్వహించిన సంగతి మీకు తెలుసు. అంతేకాక సంక్రాంతి బంపర్ బహుమతులుగా ఒక ఏసీ డీలక్సు కారు, మారుతీకారు, మారుతీ వేనులతోపాటు మరికొన్ని ఆకర్షణీయమైన బహుమతులనుకూడా ఇచ్చి ప్రోత్సహించేరు...

"శ్రీ భానోజీరావుగారు అమరదీప్ ద్వారా ఇచ్చిన బహుమతులను అంచనా వేస్తే రోజుకు ఇరవై వేల రూపాయల చొప్పున నెల రోజులకూ ఆరులక్షల రూపాయలూ, బంపర్‌డ్రా బహుమతుల క్రింద మరో మూడు లక్షల రూపాయలూ వెరసి తొమ్మిది లక్షల రూపాయలు ఉదారంగా ఖర్చు చేసేరు. ఇదికాక పత్రికా ప్రకటనలకూ, రేడియో ప్రకటనలకూ, ఉద్యోగుల జీతభత్యాలకూ అలంకరణలూ మొదలుగాగల అనేక ఇతర ఖర్చులకూ ఎలా లేదన్నా కనీసం మరో అయిదారు లక్షల రూపాయలు ఖర్చైఉండాలి. సుమారు పదిహేను లక్షల రూపాయలు ఖర్చుపెట్టిన ఈ వస్త్ర వ్యాపార రహస్యం ఏమిటి?...

"మొత్తం పండుగ సీజను నెల రోజులూ సగటున రోజుకు రెండు వేల కూపనుల ద్వారా నాలుగు లక్షల రూపాయలు అమ్మకం జరిగినట్లుగా మాపత్రికా ప్రకటనల ద్వారానే మీకు తెలుస్తోంది. అంటే సీజను మొత్తాన

కోటీ ఇరవై లక్షల అమ్మకానికీ ఎలా లేదనుకున్నప్పటికీ నలభై రెండు లక్షల లాభం వస్తుంది. అందులో ఎంతో ఉదారంగా ఇచ్చిన బహుమతుల ఖర్చు పదిహేను లక్షలూ, బేంకు వడ్డీతోపాటు చెప్పరాని ఇతర ఖర్చులు మరో పదిహేడు లక్షలూ తీసేసినప్పటికీ ఇంతటి సాహసం చేసినందుకు కేవలం నెలలో పదిహేను లక్షల రూపాయలు నికరంగా మిగుల్చుకున్న డేషింగ్ అండ్ డేరింగ్ టెక్స్‌టైల్ మాగ్నెట్ శ్రీ భానోజీరావు గారిని అభినందించకతప్పదు...

అయితే ఈ విషయంలో శ్రీ భానోజీరావు గారితోపాటు నగరంలోని ఇతర చిన్న, మధ్య తరగతి వస్త్ర వ్యాపారులను ఇంటర్వ్యూ చేయడం జరిగింది. వాటిని సమీక్షిస్తే బయటపడిన కొన్ని నిజాలు మేధావులైన మీ ఆలోచనకు ఆహారంగా మీ ముందుంచుతున్నాను...

ఆయన ప్రారంభించిన ఈ బహుమతి పథకాల మీద ప్రజలు ఎగబడడంతో తప్పనిసరిగా విధిలేక తలవంచి అంత ఎత్తున కాకపోయినా యథాశక్తి బహుమతులను ప్రకటించక తప్పలేదు ఇతర వ్యాపారులకు. పోటీ పడలేని వాళ్ళకి మిగిలింది మురిగిపోతున్న పెట్టుబడి మాత్రమే. ఇకపోతే శ్రీ భానోజీరావుగారు సృష్టించిన ఈ సంక్షోభంనుండి వచ్చే ఏడాది ఆయనైనా తప్పించుకోగలరా లేదా అన్న సందేహం ఆయనకూ కలిగింది. అంచేత వస్త్ర వ్యాపార రంగంనుంచి ఈ పదిహేను లక్షల లాభంతో శాశ్వతంగా ఆయన విరమించుకుంటే ఆలోచనాపరులెవ్వరికీ ఆశ్చర్యం కలిగించదు...

"ఒక్క రూపాయి లాటరీ టిక్కెట్టుతో లక్ష రూపాయలు గడించాలనీ, పది పైసలు బ్రాకెట్టు మీద పది రూపాయలు సంపాదించాలనీ, పేకాట పందేలూ పెరగాలనీ, అవసరాలు గడుస్తూనే సౌకర్యాలూ, విలాసాలూ పొందాలనీ 'ఆశ' పడే మనుషుల దౌర్బల్యాలను అందంగా ఎక్స్‌ప్లాయిట్ చేసే ఇటువంటి పథకాలపట్ల ముందు ముందు మీరెలా ప్రవర్తించాలో మీరే నిర్ణయించుకోవసిందిగా కోరుతూ మీ దగ్గరనుంచి సెలవు తీసుకుంటున్నాను" అంటూ గోపీ కూర్చున్నాడు.

అంతవరకూ నిశ్చేష్టులైపోయిన సభికులలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. తన పత్రిక భవిష్యత్ కళ్ళ ముందు కదిలి మనసులో అలజడి కలిగినప్పటికీ తృప్తిగా లేచాడు జగన్నాథం.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికా, 30-4-1985)